


ప్రాచీన పద్ధతిలో..

- శ్రీశైలంలో ఆలయ పైకప్పు మరమ్మతు పనులు
- రూ.3 కోట్ల అంచనాతో త్వరలో ప్రారంభం
- నేడు మంత్రుల సమక్షంలో ఒప్పందం



నంద్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఆలయాలతో పాటు ప్రాంగణంలోని పరివార ఆలయాల్లో సైతం చాలా చోట్ల పైకప్పు దెబ్బతిన్నది. నీటి లీకేజీలతో ఈ సమస్య ఏర్పడింది. ఈ పరిణామం ఇటు ఆలయ అధికారులను, భక్తులను కలవరపరిచింది. ప్రాచీన ఆలయానికి మరమ్మతు పనులు ఆధునిక పద్ధతిలో చేపడితే ప్రాచీనతకు భంగం వాటిల్లుతుంది. భారతీయ ప్రాచీన నిర్మాణ పద్ధతులు అనుసరించి మరమ్మతులు చేయాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు గత ఏడాదిలో పూణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ వారిని సదరు పనులు చేయాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన సదరు ట్రస్ట్ సభ్యులు గత ఏడాది అక్టోబరు 2వ తేదీన మరమ్మతు చేయాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. చేయాల్సిన పనులు తదితర అంశాలపై ఆలయ అధికారులతో మాట్లాడి వెళ్లారు. తాజాగా సదరు సంస్థ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చింది. సుమారు రూ.3 కోట్లతో స్వచ్ఛందంగా శాస్త్రీయ పద్ధతుల్లో పనులు చేపట్టనున్నారు. ఈ సంస్థ గతంలో వివిధ దేవాలయాల్లో ఈ తరహా పనులు చేపట్టింది.



లడ్డు పోటు మండపం

శివరాత్రి తరువాత పనులు ప్రారంభం

పూణేకు చెందిన ఓ సంస్థ నేడు ఒప్పందం పక్రియ చేసుకోనుంది. ఇప్పటికే సదరు సంస్థ సింహాచలం దేవాలయంలో పనులు చేస్తున్నారు. ఇక్కడ శివరాత్రి బ్రహ్మోత్సవాలు పూర్తయిన తర్వాత మార్చి 2వ తేదీ నుంచి శ్రీశైలంలో పనులు ప్రారంభిస్తారు. శాస్త్రీయ పద్ధతుల్లో మరమ్మతు పనులు చేపడితే ఆలయ ప్రాచీనతకు ఎలాంటి భంగం కలగకుండా ఉంటుంది.

- నరసింహారెడ్డి, ఈఈ, శ్రీశైలం

నేడు మంత్రుల సమక్షంలో ఒప్పందం

శ్రీశైలంలో సోమవారం మంత్రుల సమక్షంలో సదరు సంస్థ పనులు చేసేందుకు తగిన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకోనుంది. 3,17,988 చదరపు అడుగులు విస్తీర్ణం కలిగిన ఈ ఆలయ ప్రాంగణంలో వేల సంవత్సరాల నాటి పురాతన మండపాలకు, ఆలయాలకు సదరు సంస్థ మరమ్మతులు చేసేందుకు ఒప్పుకుంది. ఆలయ అధికారులు కోరడం.. సంస్థ సభ్యులు వెంటనే పరిశీలించి పనులు చేస్తామని ముందుకు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సహస్ర దీపారాధన మండపం

ప్రాచీన పద్ధతిలో ఇలా...

శాస్త్రీయ పద్ధతిలో మరమ్మతులు చేయాలంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. వెయ్యేళ్ల క్రితం నిర్మాణాలు జరిగిన పద్ధతిలోనే ఒక మిశ్రమం తయారు చేస్తారు. సున్నం, బెల్లం, కరక్కాయ పొడి, కాల్చిన మట్టి, ఇటుక ముక్కలు, ఇటుకల పొడితో పాటు అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న బంక (ఆ ప్రాంతపు చెట్ల నుంచి సేకరించేది) వాడుతారు. వేర్వేరు డ్రమ్ముల్లో వీటిని దాదాపు కొన్ని రోజుల పాటు నానబెట్టుకున్నాక సమపాళ్లలో ఇసుకతో కలిపి ఒక మిశ్రమం సిద్ధం చేసుకుంటారు. ఆపై మరమ్మతులు ఉన్న చోట ఆ మిశ్రమాన్ని ఒక క్రమపద్ధతిలో ప్లాస్టింగ్ చేసుకుంటూ వెళ్తారు.



లడ్డు పోటు దేవాలయం వెనుక ఉన్న శివాలయాలు



వీర శిరోమండపం

రోడ్డు టెర్రర్..!

- నెత్తురోడుతున్న రహదారులు
- ఏటా పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని రవాణ, పోలీసు శాఖలు
- తూతూ మంత్రంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. నిత్యం ఏదో ఒక రోడ్డులో మృత్యు ఘంటికలు మోగుతూనే ఉన్నాయి. రహదారి ప్రమాదాలను నివారించడంలో అటు రవాణా, ఇటు పోలీసు శాఖల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులకు, ఆర్టీసీ, ఆటో, లారీ, ఇతర వాహనడ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహించకపోవడం వల్లే ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నట్లు తెలుస్తోంది. రవాణా శాఖ అధికారులు బ్లాక్ స్పాట్లు గుర్తించి ఆ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదికలు సమర్పిస్తున్నా ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల అథారిటీ, మున్సిపల్ అధికారులు మాత్రం స్పందించడం లేదు.

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కోడుమూరు రహదారిలో జరిగిన ఓ ఘటనలో ఒకరు, మరో ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ రెండు ప్రమాదల్లో వారి స్పీడును పరిశీలిస్తే 140 కి.మీ. వేగంతో వెళ్తున్నట్లు తెలిసింది. అలాగే రోడ్డుపై సరైన అవగాహన లేక ఓవర్‌టెక్ చేయబోయి ప్రమాదానికి గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గమనిస్తే ప్రతి ప్రమాదం కూడా డ్రైవర్ నిర్లక్ష్యమని అధికారుల విశ్లేషణలు చెబుతున్నాయి. నిద్రమత్తు, మద్యం సేవించి వాహనాలు నడపటం, దీంతో పాటు సురక్షిత ప్రయాణం ఎలా ఉండాలనే దానిపై అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా మానవ తప్పిదాల వలన 95 శాతం ప్రమాదాలు జరుగుతుంటే అందులో డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల 75 శాతం, మరో 25 శాతం రోడ్లు, వాహనాల మరమ్మతుల కారణంగా జరుగుతున్నట్లు పలువురు నిపుణులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షా 50 వేల మంది మృత్యువాత పడుతుంటే నాలుగు లక్షలకు పైగానే క్షతగాత్రులుగా మారుతున్నారు. మన రాష్ట్రంలో సుమారు ఏటా 12 వేల మంది మృతి చెందుతున్నారు. అలాగే జిల్లాలో ఏటా 500 నుంచి 600 మంది వరకు మృతి చెందుతున్నట్లు, 3 వేల మందికిపైగా గాయాలపాలవుతున్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.



ఈ ఏడాదిలో ఇప్పటికి 40 మంది దుర్మరణం

ప్రమాదంగా ఆటోలు, బైకుల ప్రయాణం

ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు గమనిస్తే ఎక్కువ శాతం జిల్లాలో ఎక్కువగా ఆటోలు, బైకుల ప్రమాదాలే ఎక్కువగా ఉన్నాయి. లారీలు యమపాశాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఆటోలు, మోటారు సైకిళ్లపై కనిపిస్తుంటారు. ఒక మోటారు సైకిల్‌పై ముగ్గురు, ఆటోలో పది మంది దాకా ప్రయాణిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఉల్చాల రోడ్డు వద్ద ఇద్దరు యువకులు బైక్‌పై ప్రయాణం చేస్తూ ఆటోను ఢీకొన్న సంఘటనలో మహిళ మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు జిల్లాలో అనేకం. జనవరిలో జరిగిన ప్రమాదాలు పరిశీలిస్తే ఎక్కువ శాతం మోటారు సైకిల్ ప్రమాదాలే ఉన్నాయి.



- ఫిబ్రవరి 2వ తేదీన ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన వీరేష్ అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా.. ద్విచక్ర వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఫిబ్రవరి 5న నాగులాపురం సమీపంలోని పెంచికలపాడు వద్ద బైక్‌పై వెళ్తున్న అవ్వ, మనుమడు వెనుక నుంచి వచ్చి లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు.
- ఫిబ్రవరి 6న ఓర్వకల్లు సమీపంలో జరిగిన ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ఇద్దరు మృతి చెందారు. రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టరు ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగింది.
- ఫిబ్రవరి 4వ తేదీన ఓర్వకల్లు సమీపంలో సోమయాజులపల్లె వద్ద బొలేరో వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. అలాగే ఇదే రోజు కల్లూరు హంద్రీ వంతెనపై మోటారు సైకిల్‌పై వెళ్తున్న నాగేశారెడ్డి అనే కానిస్టేబుల్‌ను బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.
- ఫిబ్రవరి 8న వెల్దుర్తి సమీపంలో కుక్కను తప్పించబోయి కారు బోల్తా పడి మహిళ మృతి చెందింది.
- దేవనకొండ మండలం కప్పట్రాళ్లలో ట్రాక్టరు తిరగబడి జగదీష్ అనే వ్యక్తి మృతి చెందాడు.
- జనవరి మంత్రాలయం మండలంలోని చౌలేహల్లి గ్రామ సమీపంలో రెండు ఆటోలు ఢీకొని నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం 25న శనివారం ఉదయం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక పదవ తరగతి విద్యార్థిని అనూష (15) మృతి చెందింది. అలాగే చెట్నహల్లి గ్రామం నడుచుకుంటూ వెళ్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో చెన్నైకి చెందిన మహిళా భక్తురాలికి గాయాలయ్యాయి. అదే రోజు మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామం వద్ద కాలువలోకి దూసుకెళ్లిన కారు ముగ్గురికి గాయాలయ్యాయి.

మిగతా 7వ పేజీలో

రైతుకు ప్రత్యేక భూ గుర్తింపు నెంబరు

కర్నూలు ఏడీఏ శాలురెడ్డి



కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కోసం అసైన్డ్ విధానాన్ని ప్రారంభించిందని కర్నూలు వ్యవసాయ శాఖ ఏడీఏ శాలురెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మొదటి ఫేజ్‌లో భూ యజమానులకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ భూ గుర్తింపు నెంబరు కోసం నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 12 సంఖ్యలతో కూడిన ప్రత్యేక సంఖ్యను కేటాయించి తద్వారా రైతుకు భూమి గుర్తింపు కార్డు ద్వారా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు వివిధ పథకాలను వేగంగా రైతులకు చేరవేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ గ్రామంలోని రైతు సలహా కమిటీ కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వం సూచించిన పత్రాలు అందివ్వాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, లేదా 1బీ అడంగల్ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నెంబర్, తదితర వివరాలు ఇస్తే ప్రతి రైతుకు ప్రత్యేకమైన 11 అంకెలు గల గుర్తింపు కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ గుర్తింపు కార్డును పొంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని పథకాలు, కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందాలని విజ్ఞప్తి చేశారు.

వారం రోజుల్లో 316 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కొరఢా ఝుళిపించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్‌పాటిల్ ప్రతిరోజు డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆదిశగా చర్యలు తీసుకున్నారు. వారం రోజుల్లో 316 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 659 మంది బహిరంగ మద్యపానం కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనచోదకులు 2,966 మందిపై కేసులు నమోదు చేసి రూ.6.96 లక్షల జరిమానా విధించారు.

సెస్సు వసూళ్లు ఆశాజనకం

- రూ.36.14 కోట్లకు.. రూ.29.65 కోట్ల రాబడి
- ఏడీఎం నారాయణమూర్తి



కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో 7 మార్కెట్ కమిటీల ద్వారా సెస్సు వసూళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి వెల్లడించారు. మార్చి నెలాఖరు నాటికి రూ.36.14 కోట్ల సెస్సు టార్గెట్ ఉండగా ఇప్పటికే రూ.29.65 కోట్లు వసూలైందన్నారు. ఆదివారం మార్కెట్ యార్డులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు మార్కెట్ కమిటి నుంచి రూ.7.60 కోట్ల సెస్సు వసూళ్లు కావాల్సి ఉండగా... ఇప్పటికీ రూ.6.17 కోట్లు వసూలైందన్నారు. ఆదోని కమిటి నుంచి రూ.17.10 కోట్ల సెస్సుకు గానూ రూ.13.44 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి రూ.6.10 కోట్ల సెస్సును అధిగమించి రూ.7.27 కోట్ల సెస్సు వసూలైందని అన్నారు. ఆలూరు కమిటీ నుంచి రూ.52.95 లక్షలు, పత్తికొండ నుంచి రూ.7.29 లక్షలు, కోడుమూరు కమిటి నుంచి రూ.95.49, మంత్రాలయం కమిటి నుంచి రూ.35.78 లక్షల మేర సెస్సు వసూలైందని వెల్లడించారు. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటి యార్డుల్లో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, మిగిలిన నాలుగు మార్కెట్ కమిటీల్లో చెక్‌పోస్టుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం జరుగుతుందన్నారు. చెక్‌పోస్టుల్లో జీరో వ్యాపారాన్ని అరికట్టి లక్షల మేరకు సెస్సును వసూలు చేసేందుకు 'మహా చెక్' కార్యక్రమం ద్వారా తనతో పాటు సెక్రటరీలు, సూపర్‌వైజర్‌లు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు.

మార్చిలో ఎన్‌హెచ్-167 కే పనులు ప్రారంభం

ఏఈ రవికాంత్ వెల్లడి

కొత్తపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం నుంచి నంద్యాల వరకు ఎన్‌హెచ్-167కే కింద చేపట్టబోయే జాతీయ రహదారి నిర్మాణ పనులు మార్చి నెలలో ప్రారంభం కానున్నట్లు ఎన్‌హెచ్-167 కే ఏఈ రవికాంత్ వెల్లడించారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సంగమేశ్వరం నుంచి నంద్యాల వరకు 620.279 ఎకరాలు భూసేకరణ కూడా ఇది వరకే పూర్తి చేసి బాధిత రైతాంగానికి నష్టపరిహారం కూడా దశలవారిగా వారి బ్యాంకు ఖాతాలకు జమవుతున్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్‌వో కన్వర్షన్ రూ.776.17కోట్లతో 62.571 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పది మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతామని తెలిపారు. టెండర్లు కూడా పూర్తయ్యాయని, అతిత్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆత్మకూరు నుంచి వెలుగోడు వరకు 17.1 కిలోమీటర్ల అటవీ ప్రాంతం కావడంతో ప్రత్యేక ప్యాకేజీ కింద ఈ రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో భాగం కావాలి

- ఆదివాసుల ఉద్యమాలకు మద్దతు ఇద్దాం
- విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ పిలుపు
- ముగిసిన 24వ సాహిత్య పాఠశాల



ప్రసంగిస్తున్న వీక్షణం సంపాదకులు వేణుగోపాల్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో సాహిత్యకారులు భాగం కావాలని విరసం (విప్లవ రచయితల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ పిలుపునిచ్చారు. నగరంలో వెంకటాద్రినగర్‌లోగల వెంకటేశ్వర కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన విరసం 24వ పాఠశాల సాహిత్య పాఠశాల ఆదివారం రాత్రి ముగిసింది. 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన ఈ రెండు రోజుల కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి విరసం నేతలు, సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా విరసం నేతల ప్రసంగాలు ఆలోచనాత్మకంగా సాగాయి. రచయితలు, కవులు, బుద్ధిజీవులు చేయాల్సిన కార్యక్రమాలపై వక్తలు చైతన్యవంతమైన ప్రసంగాలు చేశారు.

మిగతా 7వ పేజీలో

రోడ్డు టెర్రర్..!

(5వ పేజీ తరువాయి)

ఈ ఏడాది జనవరి 23న ఒక్క రోజే ఐదుగురు మృత్యువాత పడ్డారు. కర్నూలులో ఇద్దరు వృద్ధులు మృతి చెందగా ఉల్చాల రోడ్డులో ఓ మహిళ మృతి చెందింది. ఆస్పరి వద్ద ద్విచక్రవాహనం లారీని ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు, పెద్దకడుబూరు సమీపంలో హనుమాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో మరో యువకుడు దుర్మరణం చెందాడు.

- జనవరి 22న మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, ఒక డ్రైవర్ కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అలాగే మంత్రాలయం సమీపంలో సూగూరు వద్ద ద్విచక్ర వాహనంలో చీర కొంగు ఇరుక్కొని కింద పడి మహిళ మృతి చెందింది.
- జనవరి 18న హుశేనాపురం, ఓర్వకల్లు మధ్యలో ఓ కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు.
- ఈ నెల 19న తుగ్గలి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు.
- కర్నూలు నగరంలో ఈ నెల 13న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. స్పీడ్ బ్రేకరు ఎక్కించబోయి అదుపు తప్పి కింద పడి వంశీకృష్ణ అనే వ్యక్తి మృతి చెందాడు.
- జనవరి 17న కోడుమూరు సమీపంలో కారు బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఐచర్ వాహనం ఢీకొని ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన కోడుమూరు వెళ్లే రహదారిలో ఆందోళన కలిగించింది.
- జనవరి 15న వెల్దుర్తి సమీపంలో జాతీయ రహదారిపై కారు ఢీకొన్న సంఘటనలో చిన్నారి బాలుడు దుర్మరణం చెందాడు.
- గోనెగండ్ల సమీపంలో కారు అదుపు తప్పడంతో కారులో ఉన్న పది మందికి గాయాలయ్యాయి.
- ఈ నెల 6వ తేదీన కోడుమూరు రోడ్డులో కొత్తూరు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడటంతో జయన్న అనే వ్యక్తి మృతి చెందాడు.
- జనవరి 2వ తేదీన కోడుమూరు రహదారిలో కొత్తూరు కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో భార్యభర్తలు రామగోవిందు, వరలక్ష్మి దంపతులు దుర్మరణం చెందారు.
- డిసెంబరు 21వ తేదీన మద్దికెర సమీపంలో ఓ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనం పై నుంచి కింద పడి. జనవరిలో 19న కోలుకోలేక మృతి చెందాడు.

హెల్మెట్ వాడకపోవడంతోనే

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ భాగం బైక్ ప్రమాదాలే ఉన్నాయి. వీరంతా హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రమాదాల్లో మృతి చెందారు. కేవలం సెల్‌ఫోన్‌కు రూ.300లు వెచ్చించి పౌచ్, రక్షణకవచం, ప్రొటెక్షన్ గ్లాస్ వాడుతుంటారు. మన శరీరంలో ముఖ్యమైన శిరస్సుకు రూ.500లు విలువ గల హెల్మెట్ కొని ప్రయాణించడంపై నిర్లక్ష్యం వహిస్తుంటారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 6 లక్షల ద్విచక్ర వాహనదారులు ఉన్నారు. సుమారు వెయ్యి మంది మాత్రమే హెల్మెట్లు వాడుతున్నట్లు తెలుస్తోంది.

కోడుమూరు రహదారిలోనే..

కర్నూలు కోడుమూరు, దేవనకొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు రహదారిలోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గాల్లో సరైన రోడ్డు సూచిక బోర్డులు లేకపోవడం, డివైడర్లు లేకపోవడం, గ్రామాలకు చెందిన వారు బైకులపై వెళ్తుండటం, పోలీసుల తనిఖీలు లేకపోవడం ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కర్నూలు నుంచి కోడుమూరు వరకు వేగవంతమైన ప్రయాణంతో అధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసు లెక్కలో చెబుతున్నాయి. గతంలో ఎస్పీలు అప్పుడప్పుడు రహదారి ప్రమాదాల పట్ల విస్తృత అవగాహన కల్పించినా రాను రానూ కింది స్థాయి పోలీసు అధికారులు ప్రమాదాలు నివారించడంలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది.



సరైన నైపుణ్యం లేకపోవడం వల్లే..

ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ఎక్కువ మంది సరైన నైపుణ్యం, అవగాహన లేకపోవడం వల్లేనని తెలుస్తోంది. కోడుమూరు రహదారిలో అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నది వాస్తవమే. ఇంజనీరింగ్ అధికారులను కూడా సంప్రదించాం. వారు రోడ్ల సమస్య ఏమీ లేదని చెబుతున్నారు. మరో పక్క గమనిస్తే అతివేగమే ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

- తబ్రేజ్, సీఐ, కోడుమూరు



హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు

బైక్ ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది మృతి చెందడానికి కారణం హెల్మెట్ లేకపోవడమే. హెల్మెట్ ధరించాలని ద్విచక్రవాహనదారులకు పదేపదే అవగాహనకల్పిస్తున్నాం. వాహనదారుల్లో మార్పులు రావడం లేదు. రోడ్డు ప్రమాదలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - మన్సూరుద్దీన్, కర్నూలు ట్రాఫిక్ సీఐ

మల్లన్న సన్నిధిలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



ఆలయ ప్రాంగణంలో ఎ. శాంతి కుమారి

శ్రీశైలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి ఐఏఎస్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఎ. శాంతి కుమారికి ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఎ. శాంతి కుమారి ఐఏఎస్‌కు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈవో ఎం. శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

జాతరకు వేళాయె...

- 11 నుంచి మద్దమ్మవ్వ ఉత్సవాలు
- 12న కళ్యాణోత్సవం.. 13న రథోత్సవం



మద్దమ్మవ్వ దేవాలయం



గ్రామ దేవత మద్దమ్మవ్వ

మద్దికెర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత మద్దమ్మవ్వ జాతర ఉత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. మద్దికెరలో వెలసిన గ్రామ దేవత మద్దమ్మవ్వ జాతర పురస్కరించుకుని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం అమ్మవారిని పుష్పాలతో అలంకరించి ఆకు పూజ నిర్వహిస్తారు. ఈ నెల 11వ తేదీన మద్దమ్మవ్వకు ప్రత్యేక పూజలు చేస్తారు. 12న బుధవారం రాత్రి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఏర్పాటు చేసి ఊరేగిస్తారు. అదే రోజు రాత్రి 12 గంటలకు అమ్మవారి ఖడ్గానికి కళ్యాణోత్సవాన్ని నిర్వహించి అనంతరం భక్తులు తలంబ్రాలు పోస్తారు. 13వ తేదీ గురువారం మద్దమ్మవ్వకు ప్రత్యేక పూజలు, అమ్మవారికి పుష్పాలంకరణ, ఆకు పూజలు నిర్వహిస్తారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామానికి చెందిన యాదవరాజులను రాజుల దుస్తులతో మేళతాలాలతో ఊరేగింపుగా తీసుకు వస్తారు. 4 గంటలకు రథోత్సవం ముందు హోమం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు యాదవరాజులు రాజు దుస్తులతో ఖడ్గాలు ధరించి ముందుండగా అశేష జనవాహిని మధ్య అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. 14న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు రాతిదూలం పోటీలు ఉంటాయి.

ఆలయ చరిత్ర

ప్రస్తుతం మద్దికెర అని పిలవబడుతున్న గ్రామం ఒకప్పుడు మాధవికెరగా ఉండేది. గ్రామ దేవత అమ్మోరును మాధవి దేవతగా పిలిచేవారు. కాలక్రమేణా పేరు రూపాంతరం చెంది గ్రామాన్ని మద్దికెరగా దేవతను మద్దమ్మవ్వగా పిలుస్తారు. అమ్మోరు ఆలయంలో కన్నడ, తెలుగు భాషల్లోని శిలాశాసనం, అక్షర లిపిని పరిశీలిస్తే కొన్ని విషయాలు స్పష్టమవుతున్నాయి. శాతవాహనుల శకం 1741లో దేవరకొండ రామప్పనాయుడు అనే పాలేగాళ్లు ఈ శాసనాలు రాయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని అతిపెద్ద విగ్రహం మద్దికెరలో వెలసిన మద్దమ్మవ్వ విగ్రహమే. విగ్రహంలో జీవకల ఉట్టిపడుతుంది. ఇంత పెద్ద విగ్రహం రాష్ట్రంలో మరెక్కడా లేదని ప్రతీతి. ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించలేదని, అక్కడే ఉన్న మద్ది వృక్షాన్ని విగ్రహంగా చెక్కినట్లు శిలాశాసనాలు చెబుతున్నాయి. దేవతా పేరుతోనే పూర్వం మద్దికెరను, మద్దమ్మకుంటను, మద్దమ్మబావిని ఏర్పాటు చేసినట్లు పూర్వీకులు తెలిపారు.

- **అన్నదానం:** మద్దమ్మ జాతర పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఈ నెల 13న మధ్యాహ్నం గ్రామానికి చెందిన జమేదార్ సంధ్య, జంబునాథ్ రాయుడు, జమేదార్ ఉమామహేశ్వరి శ్రీనివాసుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



గ్రామ దేవత మద్దమ్మవ్వ జాతర నాలుగు రోజుల పాటు వైభవంగా జరుగుతుంది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దేవాలయాన్ని దాతల సహకారంత మరమ్మతులు చేశాం. వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశాం. అమ్మవారికి ప్రత్యేక పూజలు, పుష్పాలంకరణ విశేషంగా జరుగుతాయి.

- తిమ్మప్ప, పూజారి

చెట్నహాల్లిలో మళ్లీ గొడవ

- శ్మశాన విషయమై మరోసారి ఘర్షణ
- శాంతింపజేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు



శ్మశానం వద్దకు వచ్చిన గ్రామస్థులు

మంత్రాలయం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చెట్నహాల్లి గ్రామంలో మళ్లీ గొడవ మొదలైంది. శ్మశానం విషయమై మరోసారి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. రెండు రోజుల కిందట బీసీ, ఎస్సీల మధ్య వివాదం జరిగి 82 మంది మీద కేసు నమోదైన విషయం తెలిసిందే. తిరిగి ఆదివారం దళితుల మధ్య ఘర్షణ జరగడం చర్చనీయాంశంగా మారింది. శనివారం రాత్రి గ్రామంలోని దళిత సామాజిక వర్గానికి చెందిన బుడ్డన్న అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో శ్మశానంలో అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా శ్మశానికి సమీపంలో నివాసం ఉంటున్న దళితుల్లోని మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. తహసీల్దార్ ఎస్.రవి, వీఆర్వో భీముడు, ఎస్ఐ శివాంజల్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి నచ్చజెప్పడంతో శాంతించారు. అనంతరం అక్కడే బుడ్డన్న శవానికి అంత్యక్రియలు చేశారు. 113 సర్వేలోని రస్తా పోరంబోకు భూమిలో గత ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చింది. అక్కడికి సమీపంలోనే శ్మశానం ఉంది. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి వెళ్లినప్పుడల్లా దళితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 125, 12 సర్వే నెంబర్లలో ఉన్న శ్మశాన స్థలంలో పూడ్చుకోవాలని చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మంత్రాలయం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ కపటి నరసింహులు (42) విద్యుదాఘాతంతో శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువుల వివరాల మేరకు.. ఈ నెల 17, 18 తేదీల్లో బంగారమ్మ గ్రామ దేవర మహోత్సవాలకు గ్రామంలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను శుభ్రపరుచుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. కపటి నరసింహులు పొలాలకు పిచికారి చేసే మందును పంపుతో ఇంటిని శుభ్రం చేస్తుండగా.. ఇంటికున్న వైరు చెయ్యికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మాధవరం ఎస్ఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఎమ్మిగనూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాపిల్లలు రోధిస్తున్న దృశ్యం పలువురిని కంట తడి పెట్టించింది.

కవి సమ్మేళనంలో నాగేశ్వరయ్యకు సత్కారం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కవి కేవీ నాగేశ్వరయ్యకు కడపలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో సత్కారించుకున్నారు. శనివారం కడప నగరంలోని ఐఎంఏ హాలులో రాయలసీమ రచయితల సంఘం, కడప జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో కేవీ నాగేశ్వరయ్య రాయలసీమ ప్రాంత ఘన చరిత్రను, వైభవాన్ని కవిత్వ రూపంలో వినిపించి, సభికులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మూలా మల్లికార్జునరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే బాబు ఘనంగా సత్కరించారు.



నాగేశ్వరయ్యను సత్కరిస్తున్న సాహిత్య సంస్థ నిర్వాహకులు

ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో భాగం కావాలి



ప్రసంగిస్తున్న వరలక్ష్మి, అరసవిల్లి కృష్ణ, వసంతకుమారి, ఎన్. రవి, మహ్మద్ మియా

(5వ పేజీ తరువాయి)

ఈ సాహిత్య కార్యక్రమాల్లో పలువురు రచయితల పుస్తక ఆవిష్కరణలు జరిగాయి. విప్లవ మేధావి ప్రొఫెసర్ సాయిబాబా స్మృతిపథంలో ప్రొఫెసర్ సాయిబాబా వేదికపై సాగిన ఈ కార్యక్రమంలో ఆదివారం నాగేశ్వర్, రాంకి నేతృత్వంలో 27 పుస్తకాలు ఆవిష్కరించారు. విరసం నాయకురాలు వరలక్ష్మి అధ్యక్షతన 'తెలుగు సాహిత్యంలో వెలుగు నీడలు' అనే అంశంపై విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ నేటి ఫాసిజం సాహిత్య, కళా, మేధోరంగాలపై ప్రభావితం చూపుతోందని, ఎక్కడ ధిక్కార స్వరాలు వినిపించినా తొక్కేసే ధోరణితో ముందుకు పోతోందని చెప్పారు. రచయితలారా మీరు ఎటువైపు అన్న ప్రశ్నలోంచి 1970లో విరసం ఆవిర్భవించి అనేక ఉద్యమ, సంక్షోభ కాలాల్లో తన రచన, ఆచరణలతో ప్రజా పోరాటాల పక్షాన నిలిచిందని గుర్తు చేశారు. పీడిత సమూహాల సమస్యల పరిష్కారానికి అనేక ప్రజాస్వామిక పోరాటాలు ముందుకు వచ్చాయని చెప్పారు. విరసం నాయకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ సాహిత్యకారుల నుంచి ఈ సమాజం ఏమీ ఆశిస్తున్నదీ గుర్తించి రచన చేయాలని అన్నారు. 'విప్లవోద్యమంపై ఫాసిస్టు యుద్ధం - బుద్ధివుల పాత్ర' అనే అంశంపై పాణి మాట్లాడుతూ వనరుల దోపిడీ కోసం రాజ్యం విప్లవోద్యమం మీద యుద్ధం చేస్తున్నదని అన్నారు. దీని వెనుక కార్పొరేట్ శక్తులు ఉన్నాయని అన్నారు. కార్పొరేట్లు బీజేపీని అధికారంలోకి తెచ్చారని, అందుకే మోదీ కార్పొరేట్ల స్నేహితుడయ్యారని అన్నారు. వికసిత భారత్ అంటే కార్పొరేట్ ఇండియా అని అన్నారు. ముగింపులా ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ ప్రజల్లోకి ఫాసిస్టు ప్రమదాన్ని తీసుకపోవడానికి అనేక సృజనాత్మక రూపాలను రచయితలు ఎంచుకోవాలని అన్నారు. ఫాసిస్టు వ్యతిరేకపోరాటంలో సంస్కృతి పాత్ర కీలకం అన్నారు. ఈ రెండు రోజుల సాహిత్య కార్యక్రమాల్లో విరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రివేరా, శశికళ, నాగేశ్వరాచారి, అల్లం రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో ప్రగతిశీల కవిత్వాన్ని కవులు చదివి వినిపించారు. అరుణోదయ, ప్రజాకళామండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కర్నూలు కవులు, రచయితులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, ఎస్‌డీవీ అజీజ్, ఎస్ఎండీ ఇనాయతుల్లా, గజల్ గాయకుడు మహ్మద్ మియా తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న 150 మంది అన్నెం కుటుంబ సభ్యులు

అతిపెద్ద 'అన్నెం' కుటుంబం

కర్నూలులో కలుసుకున్న 150 మంది సభ్యులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కుటుంబం అంటే ఆత్మీయతల సమ్మేళనం. అనురాగ బంధాల నందన వనం. ఆదివారం నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని గెలాక్సీ ఫామ్‌హౌస్‌లో అన్నెం కుటుంబ సమ్మేళనం ఉద్వేగభరితంగా జరిగింది. ఒకనాటి కర్నూలు జిల్లాలో అంతర్భాగమైన (ప్రస్తుతం ప్రకాశం జిల్లా) కంభం మండలం లింగాపురం గ్రామానికి చెందిన అన్నెం కుటుంబీకులందరూ ఆదివారం కలిశారు. అన్నెం ఉల్లక్కిరెడ్డి, అన్నెం నాంచారరెడ్డి కుటుంబాలకు చెందిన నాలుగు తరాల కుటుంబ సభ్యులు దేశ విదేశాల్లో నివసిస్తున్నారు. దశాబ్దం క్రితం కర్నూలులో ఇలాగే కార్యక్రమాన్ని నిర్వహించుకొని పరస్పర ప్రేమానురాగాలు చాటుకున్నారు. రోజంతా ఎంతో సంతోషంగా గడిపారు. ఆత్మీయ కలయితతో పులకించి పోయారు. తాతయ్యా, అమ్మమ్మా, నానమ్మా, పెద్దమ్మా అంటూ ఆత్మీయ పలకరింపులతో పెద్దవారిని ఘనంగా సత్కరించారు.

తెలుగువారి హృదయాల్లో
ఘంటసాలకు శాశ్వత స్థానం

- టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



టీజీవీ కళాక్షేత్రంలో పత్తి ఓబులయ్య, బీఎస్ రావులతో సత్కారం పొందిన గాయకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తెలుగువారి హృదయాల్లో ఘంటసాలకు శాశ్వత స్థానం ఉంటుందని, ఆయన పాటలు అజరామరమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, కర్నూలు ఘంటసాల గాన కళాసమితి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో, 52వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు రోజుల 'ఘంటసాల ఆరాధనోత్సవాలు' ఘనంగా ఆరంభమయ్యాయి. తొలుత ఘంటసాల చిత్రపటానికి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు, గాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తెలుగు పాటకు అంతర్జాతీయస్థాయిలో కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చిన ఘనత తొలుత ఘంటసాల మాస్టారుకే చెల్లుతుందని చెప్పారు. ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు మాట్లా డుతూ ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించడం, ఘంటసాలను గుర్తుచేసుకోవడమేనన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమానాథరావు, డాక్టర్ నగేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి, సత్యప్రసాద్ తదితరులు గాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యాగంటీశ్వరప్ప, కన్వీనర్లు జీవీ శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, మహమ్మద్ మియా, గాయకులు చంద్రకంటి మద్దయ్య, సుధారాణి, హబీబ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవధానం తెలుగు బాషకు గొప్ప సంపద

● మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అవధానం ప్రక్రియ తెలుగు బాషకు ఉన్న గొప్ప సంపద అని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం రాత్రి నగర శివారులోని మామిదాలపాడులో గల గోదా గోకుల క్షేత్రంలో సుప్రసిద్ధ అవధాని బులుసు అపర్ణచే అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్‌శంకర్ నాయక్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ముద్రిక సాహితీ స్రవంతి వ్యవస్థాపక అధ్యక్షులు పీవీ భాస్కర్, కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నిషిద్ధాక్షరి మారేడు రాముడు, సమస్యపురాణం డాక్టర తోగాట సురేష్‌బాబు, వీపూరి వెంకటేశ్వర్లు, దత్తపతి డా.కర్నాటి చంద్రమౌళిని, హరిశ్చంద్రారెడ్డి, మధుసూదన్, విద్వాన్ మునీశ్వర్‌రావు, తోపుదుర్తి వెంకట్రావు పాల్గొన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కేవీ రాజశేఖర్ అవధాని బులుసు అపర్ణను ఘనంగా సత్కరించారు.

104 ఉద్యోగులకు న్యాయం చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగులను న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్ఎఫ్‌పీ (రిక్వేస్ట్ ఫర్ ప్రపోజల్)లో కొత్త టెండర్లలో తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఆర్ఎఫ్‌పీవో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు డీఈఓ, డ్రైవర్స్‌కు స్లాబ్ అమలు చేయాలన్నారు. సీటీసీ విధానాన్ని రద్దు చేసి ఈపీఎఫ్‌లో యాజమాన్యం వాటా యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో 104 డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి పెద్దయ్య, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కళ్యాణి, కోశాధికారి చంద్రహస్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకందార్ల సమస్యలపై మార్చి 4న గుంటూరులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతి వృత్తిదారుల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన వికసిత్ బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. సమావేశలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.మాధవస్వామి, సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.కారన్న, నాయకులు రంగప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో రాష్ట్రంలో వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ.సుభాన్ డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్తీ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో పని చేస్తుందన్నారు. ముస్లిం మైనార్టీలపై బీజేపీకి ఏ మాత్రము చిత్తశుద్ధి ఉంటే చట్ట సవరణ చేయాలన్నారు. లేనిపక్షంలో ముస్లిం ప్రజా సంఘాలు ఇతర సెక్యులర్ సంస్థలను ప్రజానీకానికి సమీకరించుకుని కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కమిటి సభ్యులు ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి.షరీఫ్, అబ్దుల్ నాసిర్, ఇలియాస్, అబ్దుల్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి చౌడేశ్వరిదేవి జాతర ఉత్సవాలు

● 10 నుంచి 16వ తేదీ వరకు.. ● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



చౌడేశ్వరి దేవి అమ్మవారు



జాతరకు సిద్ధమైన రథం

కోడుమూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం గుమ్మటోత్సవ కార్యక్రమంతో అమ్మవారి జాతర ఉత్సవ వేడుకలు ప్రారంభమవుతాయి. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 11న ప్రభోత్సవం, 12న నంది ధ్వజశావ, 13న రథోత్సవం, 14న తిరుగు రథోత్సవం, 15న పారువేట, 16న వసంతోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు.

12 నుంచి క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలు ప్రారంభం

చౌడేశ్వరదేవి జాతర పురస్కరించుకొని ఈ నెల 12 నుంచి 14 వరకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ స్టీరింగ్ కమిటీ సర్వం సిద్ధం చేశారు. దాతల సహకారంలో అంగరంగ వైభవంగా ఆటల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా 12న ఉదయం 8 గంటలకు స్లోసైకిల్ రేస్ పందెం, 10గంటలకు దీక్ష స్కూల్లో చదరంగం పోటీలు, ఉదయం 11 గంటలకు సంత మార్కెట్లో జిల్లా స్థాయి కబడ్డీ, సాయంత్రం వ్యాసరచన పోటీలు ఉంటాయి. స్థానిక మండల పరిషత్ ఆవరణలో 6 గంటలకు ఓపెన్ షటిల్ బాట్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 13న ఉదయం సంత మార్కెట్లో గోనెసంచితో పరిగెత్తు పోటీలు, 10 గంటలకు పొట్టేళ్ల పోటీలు అలాగే పోలీసులు సహకరంతో జడ్పీ హైస్కూల్ మైదానంలో వాలీబాల్ పోటీలు, మధ్యాహ్నం 12 గంటలకు సంత మార్కెట్లో రుచి తిండి వీరుల పోటీలు జరగనున్నాయి. అంతేకాకుండా తప్పెట, చిన్నారి అందాల పోటీ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. 14న ఉదయం తేరుబజారులో ముగ్గుల పోటీలు, సాయంత్ర సంతమార్కెట్లో మూజికల్ చైర్స్ పోటీలు, సాయంత్రం డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యమాన్ని చేపట్టనున్నారు. అపర్ణ స్టార్ నెట్‌వర్క్ అధినేత ఎస్‌జీ శంకర్‌బాబు అన్ని రకాల ఆటల పోటీలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఈ ఉత్సవాలకు మండలం నుంచే కాకుండా కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ ప్రాంతాల నుంచి హాజరవుతారు.

యాదవులకు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి ఇవ్వాలి

● ఆత్మీయ సమావేశంలో యాదవుల డిమాండ్



మాట్లాడుతున్న యాదవ నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): యాదవులకు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి కేటాయించాలని యాదవ సామాజిక వర్గం నాయకులు డిమాండ్ చేశారు. యాదవులకు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అధ్వర్యంలో యాదవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం యాదవులు మాట్లాడుతూ అధికంగా ఓటు బ్యాంకు ఉన్న యాదవులకు న్యాయం చేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ శేషుయాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కనీసం ఒక్క సీట్ అయిన యాదవులకు కేటాయించకపోవగడం శోచనీయమన్నారు. ఇలాంటి తరుణంలో నగరానికి చెందిన నాగరాజు యాదవ్‌కు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి ఇవ్వాలని టీడీపీని కోరడం ఎంతో ఆనందదాయక విషయమన్నారు. అనంతరం యాదవ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వరుణ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో యాదవులకు ఒక్క నామినేటెడ్ పోస్టు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. టీడీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబిఎన్.రాజు మాట్లాడుతూ జిల్లాలో బీసీ కులాల్లో ఎక్కు వజనాభా ఉన్న యాదవులే టీడీపీ పార్టీ వెంట ఉన్నారన్నారు. సమావేశంలో విజయ స్టీల్స్ అధినేత రాముయాదవ్, సింధునాగేశ్వరరావు యాదవ్, జీఏ.క్రిష్ణమూర్తి, రమణ, అయ్యన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి



ఉద్యమ శిక్షణ తరగతులకు హాజరైన ఎస్టీయూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టీకే జనార్ధన, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో రెండో రోజు ఉద్యమ శిక్షణ తరగతులు జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జరిగాయి. ఈ శిక్షణా తరగతుల్లో సీసీఏ నిబంధనలపైన రమేష్, సంఘం నిబంధనావలి, ప్రాతినిధ్యాలు, నివేదికల సమర్పణపైన జీ.వీరచంద్ర యాదవ్ శిక్షణ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో.117 రద్దును స్వాగతిస్తున్నామని అన్నారు. తదనంతరం ఏర్పాటు చేయబోయే ప్రైమరీ మోడల్ పాఠశాలల కోసం దగ్గరలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతుల వీలీనం చేయడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రతి ప్రైమరీ మోడల్ పాఠశాలకు పీఎస్, హెచ్‌ఎం/ఎస్ఏ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ప్లస్‌టు ఉన్నత పాఠశాలలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా మార్చి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. క్లస్టర్ ఉన్నత పాఠశాలలకు గ్రేడ్‌వన్ ప్రధానోపాధ్యాయులు పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, గోవిందునాయక్, వెంకన్న, ధనుంజయ, వీరచంద్ర యాదవ్, బాబయ్య, సురేష్, నరసింహ, మాదన్న, రామ్మోహన్ రెడ్డి, ముర్తుజావలి, శేఖర్, ఇస్మాయిల్, రవికుమార్, గోవిందు, గురుస్వామి పాల్గొన్నారు.

కర్రసాము శిక్షణను ప్రోత్సహించండి

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కర్రసాము శిక్షణను పోత్సహించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం స్థానిక దామోదరం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సీలంబం (కర్రసాము) పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాత ముత్తాతల కాలం నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకే కర్ర సాము నేర్పించేవారని అన్నారు. దీంతో ఆరోగ్యంతోపాటు ధైర్య సాహసాలు అలవడేవని ఆయన గుర్తు చేశారు. చిన్న పిల్లలు మంచి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండి ఆదర్శంగా నిలవాలని కోరారు. అనంతరం ఐదు మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా సీలంబం అసోసియేషన్ కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● డీఈవో శ్యామ్యూల్‌పాల్



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపాడులోని వేదాన్షి పాఠశాలలో ఒకటో రాష్ట్ర స్థాయి యోగా ప్రీమియర్ లీగ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో యోగా సాధన కోసం ప్రత్యేక తరగతులను త్వరలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చొరవతో ప్రపంచ వ్యాప్తంగా యోగా డే కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రపంచానికి ఆరోగ్య సంపదను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గత 13 సంవత్సరాల నుంచి యోగా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణిస్తున్నారని తెలిపారు. ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళలో జరగబోయే 49వ జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ క్రీడాకారులు పాల్గొని విజేతలుగా రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి, పాఠశాల కరస్పాండెంట్ పరమేష్, అనంతపురం జిల్లా యోగా సంఘం నాయకులు మనోహర్ రెడ్డి, జాతీయ యోగా సంఘం టెక్నికల్ అఫీషియల్స్ డా.ముంతాజ్ బేగం, విజయ్ కుమార్, ఈశ్వర్ నాయుడు, ఫయాజ్, పద్మలత, విద్యాసాగర్, 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఏపీ రగ్బీ బాలికల జట్టు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి బాలికల అండర్-15 రగ్బీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టును ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బొల్లవరం రామాంజనేయులు ప్రకటించారు. నగర సమీపంలోని దిన్నెదేవరపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ జట్టు మేనేజర్ జ్యోతి, జిల్లా రెడ్డీ సంఘం ప్రతినిధి కొండపోగు సుంకన్న, ప్రతినిధులు సునీత, సుప్రియ నాగేశ్వరి పాల్గొన్నారు.

43వ మాస్టర్ రాష్ట్ర అథ్లెటిక్ చాంపియన్ కర్నూలు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ స్టేట్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు అనంతపురం పీటీసీ స్టేడియంలో జరిగినట్లు ప్రెసిడెంటు పాండురంగారెడ్డి, సెక్రటరీ రవికుమార్ ఆదివారం తెలిపారు. వన్ టీ ట్రాక్ అడ్ ఫీల్డ్ ఈ వెంట్స్‌లో కర్నూలు జిల్లాకు చెందిన మాస్టర్స్ అథ్లెట్స్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని అన్నారు. జిల్లాకు చాంపియన్‌షిప్ వచ్చినందుకు జిల్లా సంఘం చైర్మన్ టీజీ వెంకటేశ్ అభినందనలు తెలిపారని చెప్పారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హమీలను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా నిర్మాణ సదస్సు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి.మధు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నాయకులు ఈశ్వర్, వెంకటేష్, గణేష్, ఆర్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చాంపియన్స్ ఎన్టీఆర్, గుంటూరు జట్లు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో బాలురలో ఎన్టీఆర్ జట్టు, బాలికల విభాగంలో గుంటూరు జట్టు గెలుపొంది చాంపియన్లుగా నిలిచాయి. ఆదివారం స్థానిక కర్నూలు క్లబ్ టెన్నిస్ మైదానంలో జరిగిన ముగిపు కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బొల్లవరం రామాంజనేయులు పాల్గొని విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీలో గుర్తింపు లభించిన సాఫ్ట్ టెన్నిస్‌కు భవిష్యత్తులో మంచి ప్రోత్సాహం ఉంటుందని రామాంజనేయులు వ్యాఖ్యానించారు. అనంతరం విజేతల వివరాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నవీన్, నవీన్, శ్యామల, అనూష, ఐజేకే పద్మజ పాల్గొన్నారు.

దారి ఇలా.. నడిచేదెలా?



సి. బెళగల్ మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. అడుగు పెట్టేందుకు వీలు లేకుండా రోడ్డు అంతా మురుగునీరే దర్శనమిస్తోంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగు వల్ల దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- సి. బెళగల్

ఏపీ ఉర్దూ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాలను షిఫ్టు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏపీ ఉర్దూ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కాలేజీని షిష్టు చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బిర్లా గేటు సమీపంలో సమావేశం నిర్వహించారు. డీఎస్ఎఫ్, ఎస్ఎస్ఏ, ఆర్ఎస్ఎఫ్ నాయకులు మహేంద్ర నాయకుడు, మహేష్, శివప్రసాద్ గౌడు మాట్లాడుతూ నగరంలో కొత్తబస్టాండులో త్రిగుణ ఫైవ్ స్టార్ రెస్టారెంటు ముందు నూతనంగా జూనియర్ కాలేజీని షిష్టు చేయడం జరిగిందని, కానీ అక్కడ సరైనటువంటి మౌలిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థిజేఏసీ సంఘం నాయకులు కిరణ్, మధు, వంశీ, శివ, అంజి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నందవరం మండలం కనకవీడు గ్రామంలో ఆదివారం తల్లిదండ్రును కోల్పోయి అనాథగా మిగిలిన అజయ్ కుమార్‌కు రూ.10వేలును వాల్మీకి బోయ ధర్మ ఉద్యమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామానాయుడు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలారీ కృష్ణ, రవిశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

ఏఎన్ఎం గ్రేడ్-3 పోస్టులు భర్తీ చేయాలి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఏఎనం గ్రేడ్-3 పోస్టులు భర్తీ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటీస్ రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో హెల్త్ సెక్రటరీస్ యూనియన్ సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబుతో కలిసి ఆమె మాట్లాడారు. కడప జిల్లాలో 12వ తేదీ నుంచి పదోన్నతులు కల్పిస్తున్నారని, ఉమ్మడి జిల్లాలో కూడా పదోన్నతులు చేపట్టాలని కోరారు.

నర్సుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నర్సులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.లీలావతి, సక్రెటరీ సీ.బంగారి కోశాధికారి లక్ష్మీనరసమ్మ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును కోరారు. అసోసియేషన్ నాయకులు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యంను కలిసి హెడ్ నర్సు స్టాఫ్ నర్సులకు సంబంధించిన 48 పేజీల వినతి పత్రం అందజేశారు. అనంతరం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిశారు. క్లర్కుల దగ్గర పెండింగ్ బిల్లులు ఉన్నాయని గవర్నమెంటు జీఎన్ఎం స్టూడెంట్‌కి హాస్టల్ భవన నిర్మాణాన్ని చేపట్టాలని యూనియన్ నాయకులు కోరారు. రక్తనమూనాలను ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో ల ద్వారా లేదా నర్సింగ్ స్టూడెంట్‌ల ద్వారా న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు పంపించాలన్న ఆదేశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో నేతలు చర్చించారు. ఆసుపత్రిలో కొందరు ప్రైవేటు ల్యాబ్‌కు రక్తనమూనాలను పంపిస్తున్నారని, నేరుగా మన హాస్పిటల్ సిబ్బంది డయోగ్నస్టిక్‌కు పంపితే పేద రోగులకు న్యాయం జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

కార్బైడ్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు రూరల్ 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలో ఉన్న కార్బైడ్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరిలో ఇదివరకు పనిచేసిన కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇచ్చి పిఎఫ్‌ను జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు లక్ష్మన్న, ఆదిశేషన్న, భాస్కర్‌రెడ్డి, శివ, సొలోమేన్, బతుకన్న, ఆనంద్, ప్రసాద్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలు

ఆలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికేర డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ (ఇంగ్లీషుమీడియం) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మనోరాజు ఆదివారం తెలిపారు. ఈనెల 7 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, మార్చి 6 వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ https://apbragcet.apcfss.in/ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. తల్లి/తండ్రి/సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదని, వివరాలకు సెల్ 9441056407 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

టీడీపీతో బీసీలకు భవిష్యత్తు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బీసీలకు భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ కార్యవర్గ సభ్యుడు ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ పార్టీ బీసీల కోసమే ఆవిర్భవించిందన్నారు. బీసీలకు ఐదేళ్లుగా రుణాలు అందలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. గొడుగు సతీష్ కుమార్, మీసేవ భీమరాజు, టైలర్‌హరి, గుడి ఎల్లప్ప, తదితరులు ఉన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం తుగ్గలిలో కరపత్రాలను విడుదల చేశారు. రోజు వారీ కూలి రూ.600 ఇవ్వాలని, రెండు పూటల విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. దరఖాస్తు చేసిన వారందరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల బీమా వర్తింప చేయాలని కోరారు. ఈ నెల 17న పత్తికొండలో సదస్సు నిర్వహిస్తున్నామని, కూలీలందరు హాజరు కావాలని కోరారు.

ఆవోపా ఉచిత వైద్య శిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అవోపా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా ఎన్ఆర్ఐ కాకుబాల్ నాగేష్ అన్నారు. ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కర్నూలు ప్రైమ్‌ప్లస్ ఫెర్టిలిటీ ఆసుపత్రి, నంద్యాల శాంతిరాం ఆసుపత్రి, ఆదోని మధు ఆసుపత్రి సహకారంతో సంతాన సాఫల్య, కంటి, ఈఎన్‌టీ పరీక్షలకు 968 మంది వచ్చారన్నారు. స్కానింగ్, ఇతర పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు ఇచ్చామని, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. వెంకటేశ్వర్లు, వెంకటేష్ బాబు, కుప్ప రాజేష్, రత్నయ్య, సురేష్, నాగరాజు, కిరణ్, మమతాశ్రీ. శ్రీదేవి, అనిత, కవితా పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాల ఎంపిక

ఆలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలంలో గీత కార్మికుల మద్యం దుకాణాలకు 11 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ లలితాదేవి ఆదివారం తెలిపారు. ఆస్పరి మండల దుకాణానికి 7, చిప్పగిరికి 4 దరఖాస్తులు వచ్చాయని, ఆదివారం పరిశీలన పూర్తయిందన్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో లక్కీ డ్రా తీస్తారని ఆమె తెలిపారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు పెంపకందారులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.205 కోట్ల నిధులు కేటాయించాలని చేతివృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న రామాంజనేయులు

ఆదివారం చదువుల రామయ్య భవన్‌లో సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, సీపీఐజిల్లా కార్యదర్శి గిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించారు. చేతివృత్తిదారులకు కేంద్ర బడ్జెట్‌లో మోదీ పూర్తిగా అన్యాయం చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు విశ్వకర్మ యోజనను అమలు చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా సూపర్‌సిక్స్ పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని, 30 శాతం జనాబా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లకు 20 శాతం నిధులు కూడా కేటాయించలేదన్నారు. మార్చి 4న గుంటూరులో చేయనున్న ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు మాదవస్వామి పాల్గొన్నారు.

ఆలూరులో విండ్ పవర్

- ఇప్పటికే 150 యూనిట్లు
- రెండు, మూడో విడతల్లో మరిన్ని ఏర్పాటు..


ఆలూరులో శివారులో కొనసాగుతున్న పనులు


విండ్ పవర్ ప్లాంట్ కోసం తరలిస్తున్న ఫ్యాన్‌లు

ఆలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. విండ్ పవర్ (పవన విద్యుత్) ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి. మొదటి విడతలో విండ్ పవర్ ప్లాంట్‌లు భారీగానే వెలిశాయి. మొదటి విడతలో 150 యూనిట్లు పనిచేస్తున్నాయి. రెండో విడతలో 300 మంజూరు కాగా, సగం మొదలయ్యాయి. మూడో విడతలో 200లకు పైగా విండ్ పవర్ ప్లాంట్లు వెలిశాయి.

భూముల ధరలకు రెక్కలు

విండ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుతో భూముల ధరలు పెరిగిపోయాయి. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు 8.73 ఎకరాలు అవసరం. ఇందులో 1.40 ఎకరాలను కొనుగోలు చేస్తారు. మరో 7.33 ఎకరాల భూమిని 33 సంవత్సరాల పాటు లీజ్‌కు తీసుకుంటారు. వీటిని రెండు ప్రధాన కంపెనీలు నిర్వహిస్తున్నారు.

300 మంది ఉద్యోగ అవకాశాలు

విండ్ పవర్ ప్యానళ్ల ఏర్పాటుతో 300మందికి ఉద్యోగాలు లభించాయి. అయితే వీటి ఏర్పాటుతో పట్టణంలో ఇంటి అద్దెలు భారీగా పెరిగాయి. రూ.10 నుంచి 20 వేలకు కూడా ఇల్లు దొరకడం లేదు.

దళారులకు కాసుల వర్షం

దొరికిందే అదనుగా దళారులు రంగంలోకి దిగారు. రైతులతో మాట్లాడి భూములను ఇప్పిస్తానమి భారీగా కమీషన్ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు చోటా మోటా నాయకులు కూడా తమకు ముట్టజెప్పాల్సిందేనని ప్లాంట్ల నిర్వాహకులకు సూచిస్తున్నారు.

20న ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తు న్నట్లు దుర్గాప్రసాద్, తిరుమలయ్య ఆదివారం తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి నుంచి బి.టెక్ చదివిన వారు అరులన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల 60 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు

మద్దికెర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పొలాలున్న రైతులకు విశిష్ట సంఖ్య నమోదు చేస్తుస్తున్నట్లు ఏవో రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ తరహాలో కేంద్ర ప్రభుత్వం 14 అంకెల సంఖ్యను ఇస్తుందన్నారు. సొంత భూమి ఉండే రైతులకు మాత్రమే ఇస్తారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు పొందాలంటే ఇది తప్పనిసరి అన్నారు.

అవుట్‌డోర్ స్టేడియం నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే పార్థసారథి
- ఆదోనిలో ముగిసిన ఉద్యోగుల ఫ్రెండ్‌షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్


విజేత పీఈటీ జట్టుకు కప్పు అందజేస్తున్నఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అవుట్‌డోర్ స్టేడియాన్ని నిర్మించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హామీ ఇచ్చారు. స్థానిక మున్సిపల్ మైదానంలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన ఫ్రెండ్‌షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్ విజేలకు ఎమ్మెల్యే పార్థసారథి, కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తాలూకా క్రికెట్ అసోసియేషన్ విట్టా రమేష్, జనసేన నేత మల్లప్ప బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్ మ్యాచ్ ఏఎంసీ 11 వర్సెస్ పీఈటీ జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఏఎంపీ జట్టు 8 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 114 పరుగులు చేయగా, పీఈటీ జట్టు 8 ఓవర్లలో 115 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ దిసీరిస్, బెస్ట్ బ్యాటర్‌గా సీనా, బౌలర్‌గా పోస్టల్ ఉద్యోగి వీరేష్‌కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది నైపుణ్యంగల క్రీడాకారులు ఆదోనిలో ఉన్నారని, వారిని ప్రోత్సహించడానికి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో తీరిక లేక ఉంటారని ఈ క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందారన్నారు. నిర్వాహకుడు ముజీబ్ అహ్మద్ దాతలు వెల్లాల మధుసూదన్ శర్మ, మర్చంట్ క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున పాల్గొన్నారు.

బ్యాటింగ్ చేసిన ఎమ్మెల్యే

ఆదోని: టోర్నమెంట్‌లో ఉద్యయగులతో కలిసి ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి వారిని ఉత్సాహ పరిచారు. ఆటలో గెలుపోటములు సాధారణమని సమానంగా తీసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు విట్టా రమేష్, వెల్లాల మధుసూదన్ శర్మ, నాగరాజు గౌడ్, టీడీపీ నాయకులు కురువ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

22ఏళ్ల తర్వాత కలిశారు

- పెద్ద తుంబళం జడ్పీ పాఠశాల 2002-03 విద్యార్థులు


ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతుంబళం జెడ్పిహెచ్ఎస్ పాఠశాల 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలిశారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారంతా చేరి ఉపాధ్యాయులను సన్మానించారు. విశ్రాంత హెచ్ఎం పాండురంగయ్య విద్యార్థుల పేర్లను జ్ఞాపకం ఉంచుకుని వారిని అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నర్సిరెడ్డి, నరహరి, అయ్యాళప్ప, రమేష్, ఉలిగప్ప, నూర్ అహ్మద్, బసప్ప, షంషుద్దీన్, విద్యార్థులు వీరేష్, నజీరా, సునీత, రామాంజనేయులు, ఆలీబాషా, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీపై చర్చకు సిద్ధం


మాట్లాడుతున్న వైసీపీ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి

- ఎమ్మెల్యే సినిమా ట్రైలర్ అట్టర్ ఫ్లాప్
- వైసీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో భూసేకరణపై తాము అవినీతికి పాల్పడలేదని, ఈ విషయంలో ప్రజల మధ్య బహిరంగ చర్చకు సిద్ధమని వైసీపీ పట్టణ గౌరవ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, మున్సిపాల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, నాగరాజు ఎమ్మెల్యే పార్థసారథికి సవాల్ విసిరారు. ఆదివారం ద్వారక హాలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల నుంచి బలవంతంగా ప్రభుత్వం ధర కంటే తక్కువకే కొనుగోలు చేసి అవినీతికి పాల్పడినట్లు కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి ఇచ్చిన రైతులతో కలిసి ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేసి ప్రజలను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి కుయుక్తులు చేస్తున్నారని ఆరోపించారు, భూములిచ్చిన రైతులతో పాటు, గెలిపించిన ప్రజల మధ్య బహిరంగ చర్చకు రావాలని, తేదీ, సమయం మీరే ఫిక్స్ చేసి చెప్పాలన్నారు. ఎమ్మెల్యే వైసీపీ కౌన్సిలర్లు, సర్పంచులను భయపెట్టేందుకే ఇలా మాట్లాడారని, అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే చట్టపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. కౌన్సిలర్లు ఫయాజ్, అశోక్, రాజేశ్వర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, దుర్గప్ప, వెంకటేశ్వర రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శేషురెడ్డి పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి


జొన్నగిరిలో క్రీడా పరికరాలు ఇస్తున్న హాస్టల్ వార్డెన్

తుగ్గలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని హాస్టల్ వార్డెన్ రమేష్ సూచించారు. ఆదివారం మండలం లోని జొన్నగిరి సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు బ్యాడ్మింటన్ బ్యాట్స్‌తో పాటు క్రీడా పరికరాలను అందజేశారు. క్రీడలతో శారీరక దృఢత్వం వస్తుందన్నారు. ఉదయం, సాయంత్రం క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసం అందుతుందని, అలాగే క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉంటుందన్నారు. సీఆర్పీ నగేష్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ


శివప్పను పరామర్శిస్తున్నఉమాపతినాయుడు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఎంపిటీసీ శివప్పను టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామానికి వెళ్లి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు.

క్రీడలతో భవిష్యత్తు


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిషత్తు ఉంటుందని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, ఆపద్బాంధవ సేవా సమితి సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం జడ్పీ బాలుర పాఠశాలలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు ఆరు రోజులు ఉంటాయని, 18 టీంలు పాల్గొంటా యన్నారు. నగిరి కృష్ణన్న యాదవ్, భాస్కర్, హరినారాయణ, మస్తాన్, వీరేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతికి సంతాపం


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

ఆస్పరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తంగరడోన గ్రామ మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ హనీఫ్ మృతికి టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సంతాపం తెలిపారు. ఆదివారం మృతదేహానికి నివాళి అర్పించారు. ఫీల్డ్ అసిస్టెంటగా ఎన్నో సంవత్సరాలు ఉత్తమ సేవలు అందించారన్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

రజకులకు రుణాలు ఇవ్వాలి

మద్దికెర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రజకులకు ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు చిరంజీవి, శ్రీనివాసులు కోరారు. ఆదివారం క్యాలెండర్‌ను విడుదల చేశారు. పరికరాలు ఇవ్వాలని, కార్పొరేషన్ ద్వారా రుణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

లక్ష్మీనగరం, ఎల్.తండాలో కార్డెన్‌సెర్చ్

వెల్దుర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగరం, ఎల్.తండా గ్రామాల్లో ఆదివారం సీఐ మధుసూధనరావు, ఎక్సైజ్ సీఐ మంజుల ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సోదాలు నిర్వహించి. సారా బట్టీలను ధ్వంసం చేశారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పేషీ ఆదేశాల మేరకు ఫిర్యాదు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అవినీతి సీఎం దృష్టికి వెళ్లినందుకే ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ ఆదివారం తెలిపారు. సీఎం పేషీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎమ్మెల్యే పోరాటం ప్రారంభించారన్నారు. అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామన్నారు.

రేపు జాబ్ మేళా

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 11న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ చదివి, 18-35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఎంపికైనవారికి నెలకు రూ.10వేల నుంచి రూ. 16వేల జీతం ఉంటుందని తెలిపారు. విద్యార్హత పత్రాలు జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాల కోసం 7799494856, 9642735717 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

బీజేపీ నాయకుడికి అవార్డు


అవార్డు అందుకుంటున్న రామ్మోహన్

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కళాకారుల జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌కు ఆదివారం హైదరాబాదులో సుబ్బారావు కళావేదిక సేవాపత్రం, బంగారు నంది ప్రదానం చేశారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి సేవాపత్రం, బంగారు నందిని డా.వెంకటరత్నం, డా.ఉషారాణి చేతుల మీదుగా ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గుంటుపల్లెలో బండలాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న నాయకుడు

వెల్దుర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపల్లె గ్రామంలో తిరుణాలను సందర్భంగా ఆదివారం న్యూ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, మండలాధ్యక్షుడు బలరాంగౌడ్, రమాకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో అనంతపురం జిల్లా అక్కంపల్లె ఇంద్రారెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. నంద్యాల జిల్లా కొత్తకోట కంబయ్య వృషభాలు, ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ మల్యాల వృషభాలు రెండు, మూడో స్థానాల్లో నలిచాయి. తర్వాతతి స్థానాల్లో నంద్యాల జిల్లా డి.రంగాపురం రామకృష్ణారెడ్డి, అనంతపురం రుద్రవరం ఎల్లాగౌడ్ వృషభాలు నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.40 వేలు డోన్ శేషఫణి, ద్వితీయ బహుమతి రూ.30 వేలు సూదేపల్లె జయరాముడు, మూడో బహుమతి రూ.20 వేలు ధనుంజయరెడ్డి, నాలుగో బహుమతి రూ.10వేలు రామచంద్రుడు, ఐదవ బహుమతి రూ.5 వేలు అందజేశారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- వెల్దుర్తి సీఐ మధుసూదనరావు



వెల్దుర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు వెల్దుర్తి సీఐ మధుసూదన రావు వెల్లడించారు.

ప్రశ్న: మండలంలో ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలు ఏవి?

జవాబు: చెరుకులపాడు, మల్లెపల్లె, పుల్లగుమ్మి, బొమ్మిరెడ్డిపల్లె ఫ్యాక్షన్, సమస్యాత్మాక గ్రామాలుగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటుచేసి శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నాం.

ప్రశ్న: సారా, పేకాట నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: సారా తయారీ, పేకాట తదితర అసాంఘిక కార్యకలపాలపై దృష్టి పెట్టాం. సమాచా రమిచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న: అక్రమ మద్యం, బెల్టుషాపుల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఎక్సైజ్ శాఖ అక్రమ మద్యం సరఫరా, బెల్టుషాపులపై చర్యలు తీసుకుంటోంది. వారికి సహకరిస్తున్నాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఎస్పీ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ కేసులు నమోదుచేస్తున్నాం. హెల్మెట్ వాడాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎన్‌హెచ్ఏఐ అధికారుల సహకారంతో ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేస్తున్నాం. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలియజేస్తున్నాం.

ప్రశ్న: సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నారా ?

జవాబు: ప్రజలు స్మార్ట్‌ఫోన్లలో వచ్చే మోసపూరిత ప్రకటనలు, అనవసర లింకులపై క్లిక్ చేయవద్దు. ఓటీపీ పిన్, బ్యాంకు అకౌంట్ వివరాలు ఎవరికీ చెప్పరాదు. బ్యాంకు వారు వినియోగదారుల వివరాలు అడరు. ఖాతాలో మీకు తెలియకుండా నగదు డ్రా చేస్తే 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలి. గంటలోపే ఫిర్యాదు చేస్తే రికవరీకి అవకాశం ఉంటుంది.

గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో కంది, వేరుశనగ సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్ యార్డుల్లో రైతులు పండించి తెచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన మిరప, కందని, వరి, కొర్ర, సజ్జ, వేరుశనగ ధరలు తగ్గడమే గాక పంటలు కూడా రైతులకు చేతికిరాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈసమావేశంలో నరసింహులు, సమీ, మహబూబ్‌బాషా, హనుమంతు, రాజు, ఉరుకుందు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం 11వ బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు అందరు ఒక్కచోట చేరి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1997 నుంచి 2004 వరకు సీనియర్, జూనియర్ విద్యార్థులు విద్యాలయానికి సోలర్ హీటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట జిల్లా న్యాయాధికారి ఎస్ ప్రవీణ్‌కుమార్, హుస్సేన్‌బాషా, విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి, బసవరాజు, శివ, రాముడు, రమేష్, సాగర్ పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్‌కు అభినందనలు



నరసప్పను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ నరసప్పను అదివారం నందవరం టీడీపీ నాయకులు తెలుగు ఈరన్న, మల్లి, చాకలి శ్రీనివాసులు, పంపయ్య అభినందించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఇలాంటి పదవులు మరిన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి నరసప్ప కృతజ్ఞతలు తెలిపారు. తమ మీద నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చారని, ఎమ్మెల్యే నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నందవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివితే వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చని ఎంఈవో సుదర్శన్‌రెడ్డి అన్నారు. అదివారం నందవరంలో ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 17నుంచి జరగుతున్న 10వ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వంద శాతం మార్కులు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ ఉరుకుందు పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి



గ్రామస్థులతో మట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

గోనెగండ్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఘర్షణలకు దూరంగా ఉంటారో వారు విద్యాపరంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. ఆదివారం సీఐ గంగాధర్‌తో కలిసి డీఎస్పీ గంజహళ్లి గ్రామంలో పర్యటించారు. గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు సఖ్యతతో కలిసిమెలసి ఉండాలని సూచించారు. గొడవలకు దూరంగా ఉండాలని, ఎటువంటి నేరాలకు పాల్పడరాదన్నారు. మహిళలకు, పిల్లలకు సంబంధించిన నేరాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగు రోడ్డులో వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదాలు జరిగితే ఆ కుంటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడాల్సి వస్తుందని, అందుచేత ముందు చూపుతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిరపకు తెగులు



- రూ. తొమ్మిది వేల నుంచి రూ. 12 వేలకు పడిపోయిన మిరప ధరలు
- వేరుకుళ్లు తెగులుతో పంటకు నష్టం
- కాయ దశలో ఎండుతున్న మొక్కలు
- ఆందోళనలో రైతన్నలు



బూడిద తెగులు సోకిన మిరప పంట

గోనెగండ్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మిరప పంటకు బూడిదతెగులు, వేరుకుళ్ల తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పండిన పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదని వాపోతున్నారు. అంతు చిక్కని వైరస్ సోకడంతో మిరప పంట రంగు మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, పెద్దకడుబూరు, మండలాల్లో బావులు బోర్ల కింద దాదాపు 15వేల ఎకరాల్లో మిరపను సాగు చేశారు. అయితే సాగు చేసిన పంటకు బూడిద, వేరుకుళ్ల తెగులు సోకడంతో పూత, కాయ రాలిపోతుంది. కాయపట్టే సమయంలో ఈ తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆదేవిధంగా చేతికి అందిన పంటను మార్కెట్ తీసుకువెళ్లగా అక్కడ క్వింటం ధర రూ. 9000 నుంచి రూ. 12000 లోపే పలుకుంది. దీంతో అప్పుల పాలు కావాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎన్ని పిచికారి మందులు వాడినప్పటికి తెగుళ్ల అదుపులోకి రావడం లేదని పంటకు తీవ్రనష్టం వాటిల్లుతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. ఎకరం మిరపపంట సాగుచేయాలంటే సుమారు రూ. 2 లక్షల వరకు పెట్టబడి పెట్టాల్సి ఉంటుంది. కౌలు రైతులు అయితే మరో రూ. 40 వేల అదనంగా ఉంటుంది. అప్పులు చేసి మిరపను సాగుచేస్తే పంట ఎండిపోయి నష్టం మిగులుతుందని రైతులు తెలుపుతున్నారు.

గిట్టు బాటు ధర కల్పించాలి

రోగాల బారిన పడి అరకొరగా చేతికి అందిన పంటను మార్కెట్ తరలించగా గిట్టుబాటు ధర లభించడం లేదు. నాణ్యమైన మొదటి రకం మిరప పంటకు క్వింటం ధర రూ. 12000 లోపు ఉంటుంది. రెండవ రకం మిరపకు రూ. 9వేల లోపే ధర పలుకుంది. పెట్టిన పెట్టుబడి చేతికి అందడం లేదు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని మిరప రైతును ఆదుకోవాలి.

- కబుల్, రైతు గోనెగండ్ల

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



అంతర్రాష్ట్ర ఒంగోలు గిత్తల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవిబెట్ట గ్రామంలో రంగస్వామి జాతరను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర ఒంగోలు (నాలుగు పళ్లసైజు) ఎద్దుల బండలాగుడు పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎద్దులు వచ్చాయి. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో సంబరంగా ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సాంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలన్నారు. ఈ పోటీల్లో గద్వాల జిల్లా గట్టు మండలం లింగాపురం గ్రామానికి చెందిన సురేంద్ర ఎద్దులు మొదటి బహుమతి, కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం పందిర్లపల్లెకు చెందిన చాంద్‌బాషా ఎద్దులు ద్వితీయస్థానం, కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చౌటుపల్లికి చెందిన హనుమంతు ఎద్దులు మూడవ బహుమతి కైవసం చేసుకున్నాయి. అలాగే వరుసగా ఏడు బహుమతులను అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వృషభరాజుల యజమానులకు నిర్వాహకులు దేవిబెట్ట సోమేశ్వరరెడ్డి, నాగరాజుగౌడు, శ్రీనివాసుల స్వామి, మహదేవప్ప, లక్ష్మీరెడ్డి, చంద్రప్ప, చిన్న తాయప్ప, పి.సోమేష్ ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో రాముడు, జగదీష్, సోమశంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బంగారు రథంపై ప్రహ్లాదరాయలు

- వైభవంగా ద్వాదశి వేడుకలు



బంగారు రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు రథంపై విహరించారు. ఆదివారం మాఘమాసం ద్వాదశి శుభదినం సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పాత ఎస్సీ కాలనీలో రోడ్డు వేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని పాత దళితవాడలో ఆర్సీఎం చర్చి నుంచి పెద్ద కమేళా వరకు, అలాగే కొత్త దళితవాడ వరకు రోడ్డు వేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం వెంటనే స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ అధ్యక్షుడు గోవిందు, నాయకులు ఆంథోని, సురేష్, రంగన్న, బజారి, సుభాన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉరుకుంద దేవాలయంలో రుద్ర హోమం

కౌతాళం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆరుద్ర నక్షత్రం రోజున ప్రతి నెలలో మాదిరిగానే రుద్ర హోమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్,ఈవో విజయరాజు మాట్లాడుతూ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ విశిష్టతను తెలియజేసేలా భక్తులకు ఆలయంలో నూతనంగా రుద్ర హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్ప స్వామి, శివన్న పాల్గొన్నారు.

- ఉరుకుంద ఈరన్న స్వామి వారిని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి బోసు రాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ మేడిపల్లి విజయరాజు, ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువ, పూలమాలతో సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మంత్రి తెలిపారు. వీరి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు ఉలిగయ్య, నాయకులు సతీష్ నాయుడు, మహదేవ నాయుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నరేష్ బాబు (ఫైల్)

గోనెగండ్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఆదివారం ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ గంగాధర్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కులుమాల గ్రామానికి చెందిన నరేష్‌బాబు(31) నెల రోజు క్రితం మరో యువకుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో నరేష్‌బాబు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రేపు జాబ్ మేళా

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 11న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎమ్మెల్యే బి.వి.జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, పీజీ చదివి,18-35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ . 10వేల నుంచి రూ. 16వేల జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు విద్యార్హత పత్రాలు జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు.మరిన్ని వివరాల కోసం 7799494856, 9642735717 నెంబర్లను సంప్రదించాలన్నారు. యువ త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ముగ్గురు కార్మికులను నియమించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్

మంత్రాలయం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో డ్రైనేజీలు, రోడ్లు, నీటి ట్యాంకులను శుభ్రం చేసేందుకు ముగ్గురు స్వచ్ఛభారత్ కార్మికులను నియమించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి సుంకన్న డిమాండ్ చేశారు. పంచాయతీలో కార్మికులు లేకపోవం వల్ల కాల్వలు శుభ్రం చేయకపోవడం, రోడ్లలో చెత్తాచెదారం నిలిచి దోమలకు నిలయంగా మారుతున్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో డెంగీ, కలరా, అతిసారా వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాముడు, తిక్కన్న, హబీబ్, నరసింహులు, ఉరుకుందు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

మంత్రాలయం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన మాల బుడ్డన్న (40) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. బుడ్డన్న వారం రోజుల క్రితం గుండెపోటుకు గురికావడంతో ఆదోని ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఆదివారం రాత్రి మరలా గుండెనొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. మృతుడు మంత్రాలయం ఎస్‌బీఐ బ్యాంకులో సొంతంగా బుక్ కీపర్‌గా వోచర్లు రాస్తూ.. ఖాతాదారులు ఇచ్చినంత తీసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్య జేజమ్మ ఉన్నారు. సంతానం లేరు. ఈయన మృతి పట్ల చెట్నహళ్లి సర్పంచ్ బెస్త అంజనేయులు, ఎంపీటీసీ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్, టీడీపీ నాయకులు చాపల నాగేష్, మల్లేష్, శివ, పరుశప్పలు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

బాధితులకు దాతల సాయం

- ఆంధ్రజ్యోతి కథనానికి విరాళాల వెల్లువ



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి

కోసిగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 3వ వార్డులోని వాల్మీకినగర్‌కు చెందిన కౌతాళం నాగరాజు,పార్వతి దంపతులకు చెందిన గుడిసె ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైయింది. దాంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సర్వం కోల్పోయం సాయం చేయండి అన్న కథనానికి పెద్ద ఎత్తున దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశల మేరకు ఆయన సోదరుడు రామకృష్ణారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం , నిత్యావసర సరుకులు బట్టలు అందజేశారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆర్థిక సాయం చేశారు. అలాగే కోసిగి ఎస్ఐ , ఎక్సైజ్ సీఐ, టీడీపీ నాయకులు, శివస్వాములు నగదు, నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. దీంతో బాధితులు నాగరాజు, పార్వతి దంపతులు 'ఆంధ్రజ్యోతి'కి, దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, అయ్యన్న, నాడిగేని చిన్న తాయన్న, నరసన్న, గుండాల ఈరయ్య, గవిగట్టు ఈరయ్య, పోతుల నాగరాజు, సొట్టయ్య, లక్ష్మన్న పాల్గొన్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పని సరి



హనుమాపురం గ్రామ రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ మంజునాథ్

గోనెగండ్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని సీఐ గంగాధర్ అన్నారు. ఆదివారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్ట క్రాస్‌రోడ్డు దగ్గర వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహన దారుల దగ్గరు ఏఏ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని పరిశీలించారు. అలాగే అనుమతిలేని వస్తువులను రవాణా చేస్తున్నారా అనే అనుమానంతో కూడా వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణికులకు తగు సూచనలు చేశారు.

పెద్దకడుబూరు: మండలంలోని హనుమాపురం గ్రామ రహదారిలో కోసిగి సీఐ మంజునాథ్, పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఆటోలు, బొలెరోలు అత్యాశకు పోయి పరిమితికి మించి లోడ్‌ను వేయరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించే ప్రసక్తేలేదన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం మండలం మాధవరం రోడ్డులో ఆదివారం సాయంత్రం మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను ఆపి రికార్డులు, లైసెన్సులు పరిశీలించారు. కర్ణాటక మద్యం మందుగుండా సామగ్రి, వంటి వాటిని దృష్టిలో ఉంచుకుని తనిఖీలు చేశారు. ఆటోలు కెపాసిటీకి మించి భక్తులను ఎక్కించుకోవడం, ఆర్సి లైసెన్సు, పర్మిట్, ఎఫ్‌సీలను తనిఖీ చేసి అపరాధ రుసుం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలకు నివారణకు తగిన జాగ్రత్తలు, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ అంజనేయులు, పరమేష్, రామకృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాలీ బసయ్య స్వామి రథోత్సవం



కోలాటం ఆడుతున్న చిన్నారులు



స్వామికి పూజలు చేస్తున్న ప్రదీప్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి



మాధవరంలో సాలీ బసయ్యస్వామి రథోత్సవం

మంత్రాలయం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో సాలీ బసయ్యస్వామి రథోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం బిచ్చాల మఠం పీఠాధిపతి వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో జంగం వీరన్నస్వామి, మఠం సూగయ్య స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి శివునికి, నందికి, శివలింగానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి చూడముచ్చటగా అలంకరించారు. రథంపై రామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు, సాలీ బసయ్య స్వామి, శివలింగాలను ఉంచి ఊరేగించారు. రథం ముందుకు సాగుతుండగా నందికోళ్ల, కోలాటాలు, బాలికలు, బొమ్మలు ప్రత్యేక నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా తయారు చేయించిన గజ మాలను భక్తులు ఊరేగింపుగా తీసుకవచ్చి రథానికి వేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంచాల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, మిస్సల్ క్రాం తికుమార్ రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, రాకేష్‌రెడ్డిలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో నల్లగౌని రామకృష్ణారెడ్డి, గొళ్ల నర్సిరెడ్డి, పైబావి వీరారెడ్డి, భీమిరెడ్డి, హనుమంతరెడ్డి, నరసన్న, నరసింహులు, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.